క్లుప్తంగా

కూలిన మట్టి మిద్దె



వర్షానికి కూలిన మట్టి మిద్దె

వెలుగోడు: మండల పరిధిలోని వేల్పనూరు గ్రామంలో గాజుల ఈశ్వరయ్యకు చెందిన మట్టి మిద్దె కూలిపోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన మట్టి మిద్దె దెంతెలు విరిగి కూలిపోయింది. వంట సామగ్రి, నిత్యావసర సరుకులు, దుస్తులు, టీవీ పూర్తిగా పాడైపోయాయని, ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని బాధితుడు ఈశ్వరయ్య తెలిపారు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని అతడు కోరాడు.

పైపులైన్ మరమ్మతులు



పైపు లైన్ మరమ్మతులు చేస్తున్న కూలీలు

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు పంచాయతీ క్రిష్టారావుపేట గ్రామంలో గురువారం పైపులైన్ మరమ్మతులు చేపట్టారు. నేషనల్ హైవే పను నిమిత్తం భారీ వాహనాల రాకపోకలతో పైపులైన్లపై ఒత్తిడి ఎక్కువై పగిలి పోవడంతో రెండు రోజులుగా క్రిష్టారావుపేట గ్రామంలో వీధి కుళాయిలకు నీటి సరఫరా నిలిచిపోయిందని సర్పంచు వరప్రసాద్ తెలిపారు. ప్రజల సమస్యను గుర్తించి మరమ్మతులు చేపడుతున్నామన్నారు.

వరిలో సుడిదోమను నివారించుకోండి



వరి పంట పొలాలను పరిశీలిస్తున్న ఏఓ

వెలుగోడు: వరి పైరును ఆశించే సుడిదోమను నివారించుకోవాలని ఏఓ పవన్‌కుమార్ రైతులకు సూచించారు. గురువారం ఆయన మాధవరం, మోత్కూరు, బోయరేవుల గ్రామాల పరిధిలో సాగు చేసిన వరి పొలాలను పరిశీలించారు. సుడిదోమ వరి దుబ్బుల మొదళ్లను ఆశించి నష్ట పరుస్తుందని, నివారించుకోకపోతే మొక్కలు గిడసబారి పోషకాలు అందక పసుపు రంగుకు మారి సుడులు సుడులుగ ఎండిపోతుందని రైతులకు వివరించారు.

15న మండల సమావేశం

మహానంది: ఈనెల 15న మహానంది మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మహబూబ్ దౌలా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని అధ్యక్షతన జరిగే సమావేశానికి అన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలన్నారు.

కేజీబీవీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జూపాడుబంగ్లా: మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో ఖాళీగా ఉన్న రెండు బోధనేతర ఉద్యోగాల కోసం ఔట్‌సోర్సింగ్ పద్ధతిన పని చేసేందుకు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ-1 చిన్నమద్దిలేటి కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ నైట్‌వాచ్‌మెన్-1, స్వీపర్-1 పోస్టు ఓపెన్ కేటగిరిలో(ఓసీ)ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఏడో తరగతి ఆపై చదువుకున్న మహిళలు మాత్రమే అర్హులన్నారు. ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తులను ఎంఈఓ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

ఉపాధి హామీ పనులపై ప్రత్యేక దృష్టి సారించండి

● జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: ఉపాధి హామీ పథకం కింద వేతనదారుల మొబిలైజేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఏపీఓ, క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన లేబర్ బడ్జెట్, హార్టికల్చర్, అవెన్యూ ప్లాంటేషన్, సంస్థాగత ప్లాంటేషన్, బ్లాక్ ప్లాంటేషన్, ఫారం పాండ్స్, రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ పనుల ప్రగతి లక్ష్యాలపై డ్వామా పీడీ జనార్ధన్‌రావు కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా క్లస్టర్ల వారీగా సమీక్షించారు. లేబర్ బడ్జెట్ మొబలైజేషన్‌లో వెలుగోడు, జూపాడుబంగ్లా, పగిడ్యాల, బనగానపల్లె, సంజామల, నంద్యాల, ఉయ్యాలవాడ, చాగలమర్రి, గడివేముల మండలాలు వచ్చే వారానికి ప్రగతి చూపకపోతే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో వారమంతా కలిపి 54 వేల పనిదినాలే కల్పించారని, 1.5 లక్షల పది దినాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈనెల 14వ తేదీ నుంచి పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాల్లో జిల్లా వ్యాప్తంగా మంజూరు చేసిన 1,026 పనులను స్థానిక ప్రజాప్రతినిధులతో ప్రారంభించి గ్రౌండ్ చేయాలని సూచించారు.

దుర్గామాతా.. దీవించు తల్లీ!

● వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు
● వివిధ రూపాల్లో అమ్మవారు భక్తులకు దర్శనం

జూపాడుబంగ్లా: దేవీనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 8వ రోజైన గురువారం అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. నందికొట్కూరు, శ్రీశైలం నియోజకవర్గాల్లోని పలు ఆలయాల్లో అమ్మవార్లను అర్చకులు దుర్గామాతగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. దుర్గముడు అనే రాక్షసున్ని సంహకరించిన శక్తిస్వరూపం దుర్గాదేవి అమ్మవారు. ఈరూపంలో అమ్మవారు ఎనిమిది చేతులతో కత్తి, డాలు, గద, శంఖం, చక్రం, త్రిశూలం, ధనుర్బాణాలు ధరించి సర్వశత్రుసంహారక రూపంలో ఉంటుంది. ఈరూపంలో ఉన్న అమ్మవారిని మనసారా సేవించి కొలిచిన వారికి సర్వపాపాలు తొలగిపోయి, సుఖసంతోషాలు ప్రాప్తిస్తాయని అర్చకులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా జూపాడుబంగ్లా మండలంలోని తాటిపాడు వీరభద్రస్వామి, సరస్వతీ ఆలయాల్లో దుర్గాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవార్లకు కుంకుమార్చన, పుష్పార్చన, పంచామృతాభిషేకం తదితర పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.



జూపాడుబంగ్లా క్వాటర్స్‌లోని సరస్వతీదేవి ఆలయంలో దుర్గాదేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు

సంగమేశ్వరంలో..


కొత్తపల్లి: మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రాలైన కొలను భారతీదేవి ఆలయంలో వెలసిన చదువుల తల్లి సరస్వతీ దేవి, సంగమేశ్వరం ఉమామహేశ్వరాలయంలో కొలువైన లలితా దేవి అమ్మవార్లు శ్రీదుర్గా దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కొలనుభారతి ఆలయంలో అమ్మవారిని ఆలయ అర్చకులు నూతన వస్త్రాలతో, పూల మాలలతో అలంకరించారు. తెల్లవారుజాము నుంచే అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు తదితర పూజలు నిర్వహించారు.



సంగమేశ్వరంలో దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిస్తున్న దశ్యం

రాజరాజేశ్వరిగా అమ్మవారు

ఆత్మకూరు: పట్టణంలో వెలిసిన వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు రాజరాజేశ్వరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి సన్నిధిలో భక్తులు పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి కుంకుమార్చనలు, హోమాలు చేపట్టారు. చౌడేశ్వరి ఆలయంలో దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే శివాలయం, కాళికాంబదేవి ఆలయాల్లోని అమ్మవార్లను అర్చకులు వివిధ రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.



రాజరాజేశ్వరి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న కన్యకా పరమేశ్వరి

బండిఆత్మకూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన గంగ ఉమా సమేత ఓంకారేశ్వరాలయంలో గంగ ఉమాదేవి అమ్మవారు దిప్టి దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి కుంకుమార్చన, స్వామి వారికి పంచామృత అభిషేకం పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

నందికొట్కూరు: స్థానిక వాసవి కన్యకా పరమేశ్వర ఆలయంలోని అమ్మవారు భక్తులకు శ్రీదుర్గా దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు పరమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 7 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, కలశ స్థాపన అభిషేక పారాయణలు, జపాలు, మంగళహారతి సాయంత్రం జపాలు, షోడసోపచార పూజ, స్వస్తి, హారతి, సాంస్కృతిక, తదితర కార్యక్రమాలు చేపట్టారు.



దుర్గా దేవిగా అమ్మవారు

పాములపాడు: స్థానిక చౌడేశ్వరీ మాత ఆలయంలో దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. దసరా నవ రాత్రుల ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులు గణపతి పూజ, కుంకుమార్చన, సహస్రనామావళి, పంచామృతాభిషేకాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి కాయ, కర్పూరాలు సమర్పించారు.



దుర్గాదేవిగా చౌడేశ్వరీమాతా

దుర్గాదేవీ అలంకరణలో..

మిడుతూరు: స్థానిక కన్యకా పరమేశ్వరీ, చౌడేశ్వరీ ఆలయాల్లోని అమ్మవార్లు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవార్లకు అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, విష్ణు సహస్ర పారాయణం తదితర పూజలను నిర్వహించారు.



మహిషాసురమర్ధినిగా..

వెలుగోడు: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శరన్నవ రాత్రుల్లో భాగంగా గురువారం మహిషాసుర మర్ధిని అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే వేల్పనూరులోని అంకాల పరమేశ్వరి దేవి ఆలయంలో మహా గౌరీ దేవిగా అమ్మవారిని అలంకరించారు.



పల్లె పండుగను విజయవంతం చేద్దాం

వెలుగోడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలపై అవగాహన కల్పించారు. ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు అన్ని గ్రామ పంచాయతీలలో వారోత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. వారోత్సవాలలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పనులను పరిశీలించాలన్నారు. ప్రతి గ్రామంలో సిటిజన్ ఇన్ఫర్మేషన్ బోర్డ్ ఏర్పాటు చేయాలని, అందులో గ్రామాభివద్ధికి సంబంధించిన విషయాలను పొందుపరచాలని సిబ్బందికి సూచించారు. వారోత్సవాలపై ప్రజాప్రతినిధులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో పీఆర్ఏఈ శ్రీనివాసులు, ఏపీఓ మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి

→ **జూపాడుబంగ్లా:** ఈనెల 14న తాటిపాడు, 15న తూడిచెర్ల, 80బన్నూరు, పోతులపాడు, 16న మండ్లెం, తర్తూరు, 17న మండ్లెం, భాస్కరాపురం, 18న జూపాడుబంగ్లా, తంగడంచ, 19న జూపాడుబంగ్లా, తరిగోపుల, 20న పారుమంచాల, పి.లింగాపురం గ్రామాల్లో పల్లెపండుగ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఏపీఓ గౌరీబాయి తెలిపారు.

→ **నందికొట్కూరు:** ఈనెల 14న కోనేటమ్మపల్లి, 15న వడ్డేమాన్, 16న బిజినవేముల, సాతనకోట, 17న అల్లూరు, కొణిదేల, 18న 10 బొల్లవరం, 19న దామగట్ల, 20న మల్యాల గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్రమణ్యం తెలిపారు.

→ **పగిడ్యాల:** ఈ నెల 14న సంకిరేణిపల్లె, 15న పగిడ్యాల, 16న తూర్పు, పడమర ప్రాతకోట, 17, 18న తూర్పు నెహ్రూనగర్, 19న ఎం. ఘణపురం, 20న నెహ్రూనగర్‌లో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుమిత్రమ్మ తెలిపారు.

→ **బండిఆత్మకూరు:** ఈ నెల 14వ తేదీ నుండి 20 తేదీ వరకు అన్ని గ్రామ సచివాలయాల్లో పల్లె పండుగ- పంచాయతీ వారోత్సవాల పేరుతో కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీడీఓ దస్తగిరి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.



బొమ్మల కొలువు

దసరా పండుగను పురస్కరించుకుని నందికొట్కూరు పట్టణంలోని సుబ్బారావుపేట రాఘవేంద్ర ఏజెన్సీ వారి స్వగృహంలో బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. పిల్లలు చిన్న తనం నుంచి పెరిగి పెద్దై, ఉద్యోగం చేసే క్రమాలను తెలిపే వివిధ రూపాల బొమ్మలకు ప్రతిష్టించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా సంఘం నాయకురాళ్లు లగిశెట్టి ప్రసన్నలక్ష్మి, దిండుకుర్తి మంజుల, మహిళలు తదితరులు పాల్గొన్నారు. – నందికొట్కూరు

భక్తిశ్రద్ధలతో చండీయాగం

మహానంది: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహానందిలోని శతచండీయాగశాలలో గురువారం చండీయాగం నిర్వహించారు. ఓ వైపు జోరుగా వర్షం కురుస్తున్నా చండీయాగం కొనసాగించారు. వేదపండితులు రవిశంకర అవధాని ఆధ్వర్యంలో రుద్ర, చండీ హోమాలు, పూర్ణాహుతి పూజలు నిర్విరామంగా కొనసాగాయి.

ఇద్దరు ఎంఎల్‌హెచ్‌పీలు రాజీనామా

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఇరువురు ఎంఎల్‌హెచ్‌పీలు(మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్)వారి విధులకు రాజీనామా చేసినట్లు ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ గంగాధర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ 80బన్నూరు ఆరోగ్య ఉపకేంద్రం ఎంఎల్‌హెచ్‌పీ ప్రత్యూష, తంగడంచ ఆరోగ్య ఉపకేంద్రం ఎంఎల్‌హెచ్‌పీ కల్పనా వ్యక్తిగత కారణాలతో విధులకు రాజీనామా చేసినట్లు తెలిపారు. వారి రాజీనామా పత్రాలను జిల్లా అధికారులకు పంపించినట్లు తెలిపారు.

నీటి ముంపు బాధితులకు ఉద్యోగాలు ఇవ్వాలి

నందికొట్కూరు: నీటి ముంపు బాధితులకు ఉద్యోగం ఇవ్వాలని సీపీఐ జిల్లా నాయకులు రమేష్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పార్టీ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడారు. శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణంలో సర్వం కోల్పోయి రోడ్డున పడిన బాధితులకు 98 జీఓ ప్రకారం చంద్రబాబు నాయుడు గతంలో ముఖ్యమంత్రి హోదాలో అనేక సార్లు ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చారన్నారు. అప్పటికైనా స్పందించి శ్రీశైలం నీటి ముంపు బాధితులకు ఉద్యోగాలిచ్చి ఆదుకోవాలని కోరారు. సమావేశంలో శ్రీశైలం నీటిముంపు బాధితులు దరగయ్య, నాగశేషిరెడ్డి పాల్గొన్నారు.

దోమల నివారణకు గుంబూషియా చేపలు

మహానంది: దోమల నివారణలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు తెలిపారు. మహానంది మండలం నందిపల్లె గ్రామంలోని నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో గురువారం గుంబూషియా చేపలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మలేరియా నివారణ సహాయ అధికారి వరప్రసాద్ రెడ్డి, ఎంపీహెచ్ఈఓ హుసేన్‌రెడ్డి పాల్గొన్నారు.

మల్యాల నీటి పథకం పరిశీలన

నందికొట్కూరు: మండల పరిధిలోని మల్యాల గ్రామం సమీపంలో ఉన్న రక్షిత మంచినీటి సరఫరా పథకాన్ని మున్సిపల్ కమిషనర్ బేబీ, వైస్ చైర్మన్ రబ్బానీ గురువారం పరిశీలించారు. రక్షిత మంచి నీటి సరఫరా పథకం పంప్‌హౌస్‌లో ఎన్ని మోటార్లు ఉన్నాయని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ పట్టణ ప్రజలకు సరఫరా చేసే పంప్ హౌస్‌లో క్లోరినేషన్ చేయాలన్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పట్టణ ప్రజలకు తాగునీరు అందించాలన్నారు. సమస్యలు వస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈమె వెంట కౌన్సిలరు చిన్నరాజు ఉన్నారు.

పెరిగిన ధరలను నియంత్రించడంలో విఫలం

– వినూత్న రీతిలో నిరసన తెలిపిన సీపీఎం నాయకులు

నందికొట్కూరు: దసరా, దీపావళి పండుగ సమయంలో నిత్యావసర, కూరగాయల ధరలు ఆకాశన్నంటినా నియంత్రించడంలో తెలుగు దేశం ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు, ఫక్కీర్‌సాహెబ్ విమర్శించారు. గురువారం పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం సర్కిల్ వద్ద గడ్డి తింటూ విన్నూత రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యావసర సరుకుల ధరలు, కూరగాయల ధరలు విపరీతంగా పెరిగిన టీడీపీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉందన్నారు. పండుగ వేళలో ధరలు పెరగడంతో సామాన్య, పేద మధ్య తరగతి కుటుంబాల ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నా ప్రభుత్వానికి మద్యంపై ఉన్న ప్రేమ ప్రజలపై లేదని ధ్వజమెత్తారు. పెంచిన ధరలు ప్రభుత్వం తగ్గించకపోతే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. ఆందోళనలో సీపీఎం నాయకులు గోపాలకృష్ణ, జయరాణి, మధులత, ఉస్మాన్‌బాషా, బాబు, రషీద్, త్యాగరాజు, చాంద్‌బాషా, అశోక్, తదితరులు పాల్గొన్నారు.



వినూత్న రీతిలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ఘర్షణలకు తావివ్వొద్దు

– డీఎస్పీ రామాంజినాయక్

పాములపాడు: చిన్నచిన్న విషయాలకు ఘర్షణలకు దిగవద్దని ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ సూచించారు. గురువారం రాత్రి మండలంలోని ఇస్కాల గ్రామంలో పర్యటించారు. ప్రజలో ఆయన మాట్లాడుతూ ప్రతి సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. సమస్య తీవ్రమైందైతే పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించాలన్నారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సైబర్ మోసాలు, బాల్య వివాహాలు, పొలం తగాదాలు, రోడ్డు భద్రతా, మహిళల పట్ల అసభ్యకర ప్రవర్తన వంటి విషయాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ సురేష్‌బాబు పాల్గొన్నారు.



ప్రజలకు వివరిస్తున్న డీఎస్పీ రామాంజినాయక్

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

పగిడ్యాల: ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రమణ్యం తెలిపారు. గురువారం పడమర ప్రాతకోట గ్రామంలో ఆయన ప్రజలతో మాట్లాడుతూ శాంతియుత జీవనం కొనసాగించాలన్నారు. ఆయన వెంట ముచ్చుమర్రి ఎస్ఐ సి.శరత్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

ఆకాశంలో ఇంద్రధనస్సు...!

మహానంది: మహానంది మండలంలో గురువారం మధ్యాహ్నం, సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. వర్షం అనంతరం ఎం.తిమ్మాపురంలో ఆకాశంలో ఇంద్రధనస్సు కనువిందు చేసింది. మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురంలో ఈ దృశ్యం ప్రజలను ఆకర్షించింది.



తిమ్మాపురంలో కనిపించిన ఇంద్రధనస్సు

మల్లన్న సేవలో మంత్రులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. గురువారం సాయంత్రం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన మంత్రులకు ఈఓ డి.పెద్దిరాజు, అర్చకులు, వేదపండితులు స్వాగతం పలికారు. అనంతరం మంత్రులు మల్లికార్జున స్వామివారికి రుద్రాభిషేకం, భ్రమరాంబా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆలయం వద్ద ఆశీర్వచన మండపంలో మంత్రులకు వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. ఈఓ స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూ ప్రసాదాలను, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.



మల్లన్న దర్శనానికి వచ్చిన మంత్రులకు స్వాగతం పలుకుతున్న ఈఓ

ఎన్నికల వాగ్దానాలు నెరవేర్చాలి

ఆత్మకూరు: ఎన్నికల సమయంలో వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని నెరవేర్చాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శివర్గ సభ్యులు వి.యేసురత్నం, పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్ డిమాండ్ చేశారు. గురువారం సుదర్శనవర్మ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి వంద రోజులవుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. బడ్జెట్ లేదని సాకుతో సంక్షేమ పథకాలను ప్రజలకు దూరం చేయడం తగదన్నారు. 50 ఏళ్ల వయస్సున్న బీసీ, ఎస్సీ, ఎస్టీలకు పెన్షన్లు, మహిళలకు నెలకు రూ.1,500, విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.15 వేలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అమలు చేయాలన్నారు. సమావేశంలో నాయకులు డి.రామ్‌నాయక్, ఎన్.మంజుల, ఎ.సురేంద్ర, జి.నాగేశ్వరరావు, సద్దాంహుసేన్ పాల్గొన్నారు.

మద్యం దుకాణాల దరఖాస్తుకు నేడు ఆఖరు

ఆత్మకూరు: ఆత్మకూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ప్రైవేటు మద్యం దకాణాలకు దరఖాస్తుల సమర్పణ శుక్రవారం రాత్రి 7 గంటల సమయానికి ముగుస్తుందని ఎక్సైజ్ సీఐ కిషోర్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆత్మకూరు ఎక్సైజ్ స్టేషన్ పరిదిలోని ఆత్మకూరు టౌన్, ఆత్మకూరు రూరల్, కొత్తపల్లి, పాములపాడు, శ్రీశైలం రూరల్, వెలుగోడు మండలాల్లో మొత్తం 13 మద్యం దుకాణాలకు దరఖాస్తులు చేసుకునేందుకు అనుమతులు ఉన్నాయన్నారు.

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా సచివాలయం-2వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటుచేసి మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకొనే విధానంపై దరఖాస్తుదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్, ప్రొహిబిషన్ సీఐ రామాంజనేయులు విలేకరులతో మాట్లాడుతూ మండలకేంద్రమైన జూపాడుబంగ్లాలోని మద్యం దుకాణానికి అత్యధికంగా 49 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని దుకాణాల కంటే జూపాడుబంగ్లా మద్యం దుకాణానికి పోటీ అధికంగా ఉందన్నారు. ఇప్పటిదాకా మొత్తం 138 దరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ జఫరుల్లా, హెడ్‌కానిస్టేబుళ్లు పద్మనాభం, కుమారి, కానిస్టేబుల్ శివన్న పాల్గొన్నారు.

పాములపాడు: మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు పెంచిన గడువును సద్వినియోగం చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ కిషోర్ కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటరులో నూతన మద్యం విధానం 2024-25 పేరుతో ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 11 వరకు దరఖాస్తు చేసుకునేందుకు వీలుందన్నారు. 12న లక్కీడిప్ ఉంటుందని, 14వ తేదీ నుంచి కొత్త మద్యం దుకాణాలు ప్రారంభం అవుతాయని వివరించారు.



నీటిలో తడిచిన ధాన్యాన్ని చూపుతన్న రైతు



వర్షం పడుతున్న సమయంలో పట్ట కప్పుతున్న రైతులు

మొక్కజొన్న ధాన్యం.. వర్షార్పణం

కొత్తపల్లి: మండలంలోని ఎర్రమఠం, ముసలిమడుగు, గుమ్మడాపురం, సింగరాజు పల్లి, శివపురం, లింగాపురం, ఎదురుపాడు, గోకారం, కొక్కెరంచ, దుద్యాల గ్రామాల్లో గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి మొక్కజొన్న దిగుబడులు తడిసి ముద్దయ్యాయి. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురవడంతో ఆరుబయట ఆరబోసుకున్న మొక్కజొన్న ధాన్యం దిగుబడులకు తీవ్ర నష్టం కలిగింది. తడిసిన ధ్యానం కొనుగోలుకు వ్యాపారులు ముందుకు రారని, ఒక వేళ వచ్చినా తక్కువకు అడుగుతారని, ప్రభుత్వమే మద్దతు ధరతో కొనుగోలు చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.